'మాజీ సైనికుల పిల్లలకు 10 శాతం సీట్లు కేటాయించాలి'

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, డెంటల్, మెడికల్, ఇంజనీరింగ్ కోర్సుల్లో సైనికుల పిల్లలకు కనీసం 10 శాతం సీట్లను రిజర్వు చేయాలని అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు ఎన్‌కే శివణ్ణ నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక పరీక్షా ప్రాధికార అంచనా ప్రకారం 2023-24 విద్యాసంవత్సరానికి వైద్య రంగంలో 3365 సీట్లు ఉండగా కేవలం 6 సీట్లను, డెంటల్‌లో 1738 సీట్లు ఉండగా 6 సీట్లను మాత్రమే మాజీ సైనికుల పిల్లలకు కేటాయించారన్నారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దాలంటే 10 శాతం రిజర్వేషన్లు అవసరమన్నారు.



శాంతి భద్రతలపై వాగ్యుద్ధం



- చర్చకు బీజేపీ ఎమ్మెల్యే సునిల్‌కుమార్ పట్టు
- మీరే శాంతిభద్రతలను నాశనం చేశారు: ప్రియాంక ఖర్గే
- బీజేపీ హయాంలోనే నేరాలు అధికం: హోంమంత్రి

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు దారి తప్పాయని బీజేపీ సభ్యుడు సునిల్ కుమార్ ఆరోపించారు. ఈ అంశంపై ప్రశ్నోత్తరాలకంటే ముందే అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. మంగళవారం స్పీకర్ ఖాదర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించగానే ప్రతిపక్షనేత అశోక్ కూడా వాయిదా తీర్మానం కోసం ప్రస్తావించామని, చర్చకు అవకాశం ఇవ్వాలని కోరారు. హావేరిలో మహిళపై సామూహిక అత్యాచారం, బెళగావిలో మహిళను వివస్త్రను చేయడం, మండ్యలో హనుమంతుడి జెండాను తొలగించడం, శివమొగ్గలో వేటకొడవళ్లతో బ్యానర్లు వేయడం, పెరిగిపోయిన సైబర్ నేరాలు తదితర అంశాలపై సభ్యుల అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇదే సమయంలోనే మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకుని మీరు ఏ అంశాలపై మాట్లాడదలచుకున్నారో తెలుసని విరుచుకుపడ్డారు. అందుకు సునిల్‌కుమార్ కూడా దీటుగా స్పందించారు. ఇద్దరి మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో చోటు చేసుకుంది. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించిన అంశాలపై చర్చకు అభ్యంతరం లేదన్నారు. వారి పాలనలో బెంగళూరులోనే ఎన్ని హత్యలు జరిగాయనేది రాష్ట్రంలో ఏం జరిగిందనేది వివరిస్తానని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రశ్నోత్తరాలు ముగియాలన్నారు. అందుకు ప్రతిపక్ష సభ్యులు తొలుత శాంతిభద్రతల అంశానికే పట్టుబట్టారు. సునిల్‌కుమార్, మాజీ మంత్రి అరగ జ్ఞానేంద్రతో పాటు పలువురు డిమాండ్ చేశారు. మరోదశలో మంత్రి ప్రియాంక ఖర్గే శాంతిభద్రతలను నాశనం చేసేది మీరేనని, మీరే చర్చలకు డిమాండ్ చేస్తారనే వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. మధ్యప్రదేశ్‌లో రాష్ట్రానికి చెందిన రైతులను అరెస్టు చేశారని ప్రస్తావించగా బీజేపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. చివరకు స్పీకర్ జోక్యం చేసుకుని ప్రశ్నోత్తరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

మేకెదాటుకు బీజేపీ సభ్యులు సహకరించాలి : డీకే శివకుమార్



బెంగళూరు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించుందుకు మేకెదాటు ప్రాజెక్టు కీలకమని, అంగీకారం కోసం బీజేపీ సభ్యులు సహకరించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే కేసీ రామమూర్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కావేరి ప్రాజెక్టులలో తాగునీటికి అవసరమైనంత రిజర్వు చేశామన్నారు. జయనగర్‌లో మురికివాడలలో కావేరి నీటిని సరఫరాకు రూ.5 కోట్లు ఎమ్మెల్యే గ్రాంట్లలో కేటాయించాలని సూచించారు.

51 లక్షల ఎకరాలలో ఉద్యానపంటల నష్టం

రాష్ట్రంలో కరువు కారణంగా 51లక్షల ఎకరాలో ఉద్యానపంటలకు నష్టం జరిగిందని, వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి పరిషత్‌లో తెలిపారు. జేడీఎస్ సభ్యుడు శరవణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా పంటనష్ట పరిహారం అనేది కేంద్రం నిర్ణయిస్తుందని, రాష్ట్రం సాయం మాత్రమే చేస్తుందన్నారు. ఉద్యానపంటల అంశంపై నాలుగుసార్లు ప్రశ్నలు అడిగినా సంబంధిత మంత్రి సమాధానం చెప్పలేదని, రైతులపట్ల నిర్లక్ష్యం సరికాదని సభ్యుడు మండిపడ్డారు. ఈ అంశంపై సమగ్ర చర్చ, ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున ద్వారా సమాధానం ఇప్పిస్తామని సభాపతి హామీ ఇచ్చారు.

గెస్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయలేం

గెస్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయలేమని ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ స్పష్టం చేశారు. సభ్యుడు ఆర్. దేవెగౌడ ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలల్లో 16వేల మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులకు గెస్ట్ లెక్చరర్ల ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికై ఉన్నత స్థాయి అధికారుల కమిటీ ఏర్పాటు చేశామని, వారి నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా మెరిట్ జాబితాను సిద్ధం చేసుకున్నామన్నారు. రూ.26వేల నుంచి రూ.32వేల దాకా వేతనం చెల్లిస్తామన్నారు. తాత్కాలిక పద్ధతిన నియమించుకుంటున్నామన్నారు.



విధానసౌధలో బసవణ్ణ ఫొటోను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో

బసవణ్ణ ఫొటో

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు బసవణ్ణ ఆదర్శాలు సమాజానికి అవసరమని, అందుకే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ బసవణ్ణ ఫొటో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. విధానసౌధలో జగజ్యోతి బసవణ్ణ ఫొటోను మంగళవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బసవణ్ణ ఫొటోల ఆవిష్కరణ జరగనుందన్నారు. జిల్లా స్థాయిలో మంత్రులు, తాలూకా స్థాయిలో ఎమ్మెల్యేలు నగర, గ్రామ పంచాయతీలలో అధ్యక్షులు నిర్వహిస్తారన్నారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ బసవణ్ణ ఫొటో ఉంటుందన్నారు. ప్రతి మనిషి తోటి మనిషిని అభిమానించాలని, ద్వేషించడం అనేది దుర్గుణమని బసవణ్ణ బోధించారని తెలిపారు. అందుకే బసవణ్ణను సాంస్కృతిక నాయకుడిగా ప్రకటించామన్నారు. సమాజంలో మార్పు కోసం బసవణ్ణ 8 శతాబ్దాల క్రితమే పాటుపడ్డారన్నారు. శివమొగ్గలో పాతజైలు ప్రాంతాన్ని అల్లమప్రభుగాను, విజయపుర మహిళా యూనివర్సిటీకి అక్క మహాదేవి పేరు పెట్టామన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, శివరాజ్ తంగడగి, మధుబంగారప్ప, కేహెచ్ మునియప్ప, అధికారులు భాగస్వామ్యులయ్యారు.

మార్చి రాకముందే బెదరగొడుతున్న ఎండలు

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈసారి ఎండల తీవ్రత కాస్త అధికంగానే ఉంటుందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు నిజమనిపించేలా అప్పుడే ఎండలు బెదరగొట్టేస్తున్నాయి. వాతావరణ శాఖ అందించిన సమాచారం ప్రకారం గత 48 గంటల అవధిలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత హావేరిలో నమోదైంది. ఇది 36.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. బెంగళూరు నగరంలో ఈ నెల 9న 34.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మంగళవారం నాటికి కాస్త తగ్గి 31 డిగ్రీల సెల్సియస్‌లుగా ఉంది. 2005 తర్వాత ఫిబ్రవరి నెలలో వేసవి తీవ్రత అధికంగా ఉండటాన్ని బట్టి గమనిస్తే ఏప్రిల్, మార్చినెలల్లో ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. 2005లో రాష్ట్రంలో ఫిబ్రవరి 7న నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత 35.9 డిగ్రీలు కావడం గమనార్హం. అప్పట్లో రాష్ట్రంలోనే ఇది రెండో అత్యధిక ఉష్ణోగ్రతగా ఉంది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో ఉష్ణోగ్రత సరాసరి 2 డిగ్రీల వరకు అధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని దావణగెరె, దక్షిణ కన్నడ, ఉడుపి, రాయచూరు, విజయనగర, బాగల్కోటె, బెళగావి, గదగ, ధార్వాడ, కలబురగి, బళ్లారి, బీదర్, యాదగిరి, కొప్పళ, చిత్రదుర్గ జిల్లాల్లో ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్‌లకు పైగానే ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ఉష్ణోగ్రతల్లో కనీసం 5 నుంచి 8 డిగ్రీల వరకు మార్పులు జరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.



రాజ్యాంగంపై రీల్స్ చేయండి

- రూ. 50 వేలు గెలవండి

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వేగవంతంగా అర్థం చేసుకునేందుకు కవితలు, కార్టూన్లు, లోగోలను రూపొందిస్తే బహుమతులు ఇస్తామనేది దశాబ్దాల కాలంగా ఉండేది. మారిన కాలానికి అణుగుణంగా రీల్స్ చేయండి ఉత్తమ బహుమతి సాధించండి అనే ప్రతిపాదన ఏకంగా ప్రభుత్వమే తీసుకువచ్చింది. రాజ్యాంగంపై రీల్స్ చేయండి.. రూ. 50 వేలు గెలవండి అంటూ ప్రత్యేక సందేశాన్ని ప్రభుత్వమే ఇచ్చింది. రాజ్యాంగంపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించింది. ఇప్పటికే వీధినాటకాలు ఇతరత్రా చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు మొబైల్స్‌లో సోషల్ మీడియాకు అనుసంధానమయ్యారు. అందుకు అనుగుణంగానే చైతన్యం కలిగించేందుకు రీల్స్ చేయాలని యువతను ఆహ్వానించింది. రాజ్యాంగం ద్వారా సమాజానికి ఎంతటి ప్రయోజం ఉంది, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలిపేలాంటి రీల్స్‌ను పరిగణిస్తామని ప్రకటించింది. కనీసం 30-40 సెకన్ల నిడివి ఉండేలా రీల్స్ ఉండాలని సూచించింది. ఉత్తమ రీల్స్‌కు రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈనెల 20లోగా రీల్స్ పూర్తి చేసి పంపాలని 22వ తేదీ సాయంత్రం 5గంటలకు విజేతలను ప్రకటిస్తామని నిర్వాహక బృందం ప్రకటించింది.



రీల్స్‌పై ప్రకటనలు ఇలా..

నెలాఖరుకే బీజేపీ తొలి జాబితా..?

- అమిత్‌షా సమీక్షలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు



బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ తొలి జాబితా ఈ నెలాఖరుకు విడుదల కావచ్చుననే తెలుస్తోంది. ఇప్పటి వరకు బీజేపీ అగ్రనేతలు రాష్ట్ర పార్టీ ముఖ్యులతో అభ్యర్థుల ఖరారుపై ప్రత్యేక సమావేశాలు జరపకపోయినా సమీక్షల ద్వారానే కొలిక్కి తెచ్చినట్లు తెలుస్తోంది. 28 లోక్‌సభ నియోజకవర్గాలపైకి ప్రస్తుతం 25 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు. వీరిలో దాదాపు పదిమంది మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని కోల్పోనున్నారు. మిగిలినవారిలోనూ స్వల్ప మార్పులతో జాబితా సిద్ధమైనట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం రాష్ట్రపర్యటనకు వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గెలుపొందే నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లను దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. గెలుపొందే వారికే టిక్కెట్ అనే కోణంలో ఢిల్లీ నుంచే పలు సర్వేలు నిర్వహించారు. అందుకు అనుగుణంగానే వరుసగా బీజేపీ ఎంపీలు గెలుస్తున్న నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. తొలి జాబితా ఈ నెలాఖరులోనే విడుదల చేయడం ద్వారా రాష్ట్రంలో ఎన్నికల వేడిని తీసుకురాదలిచారు. ఆ తర్వాత జాబితాలో ఆచితూచి ఖరారు చేసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా తొలి జాబితా విడుదల చేసే సమయంలోనే రాష్ట్రానికి సంబంధించిన అభ్యర్థుల పేర్లు ఉంటాయని అమిత్‌షా సూత్రప్రాయంగా తెలిపినట్టు సమాచారం. ఆశ్చర్యకరంగా కొత్త అభ్యర్థులు ఉంటారనే అభిప్రాయాలు ఉన్నాయి. శాసనసభ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రతిపక్షనేత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు సుదీర్ఘ సమయం తీసుకున్నారు. 28 నియోజకవర్గాలకు దాదాపు అభ్యర్థులు ఒక అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. రాష్ట్రం నుంచి ఒకరిద్దరు కేంద్రమంత్రులు కూడా పోటీ చేసే అవకాశంపైనా చర్చలు సాగుతున్నాయి. బెంగళూరు, దక్షిణకన్నడ స్థానాల నుంచి వారు పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా చిత్రదుర్గ రిజర్వు నియోజకవర్గం నుంచి మాదార చెన్నయ్య గురుపీఠం పీఠాధిపతి బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామిని పోటీ చేయించాలని భావిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణస్వామి కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన మరోసారి పోటీ చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీనికితోడు ఆయనపై పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామిని పోటీ చేయించాలని భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ రాజకీయాల్లో తిరుగులేని స్థాయికి చేరుకున్న తరహాలోనే రాష్ట్రం నుంచి మాదార చెన్నయ్యస్వామిని తెరపైకి తీసుకు రావాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే ఇప్పటి వరకు స్వామిజీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.



వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకే

కేంద్రంపై అభాండాలు

- సిద్దూ సర్కార్‌పై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ధ్వజం

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే మోదీ ప్రభుత్వంపై అభాండాలు వేస్తోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల అభివృద్ధికి గ్రాంట్లు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. గ్యారెంటీ పథకాలను సైతం సరిగా అమలు చేయలేక అభివృద్ధి నిధులను మళ్లిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.98 లక్షల కోట్లుగా ఉందని, ఫిబ్రవరి నెల సగం గడిచినా ఇంకా 38 శాతం అంటే రూ.1.13 లక్షల కోట్లు ఖర్చు కాలేదన్నారు. ప్రధాని మోదీ ప్రతి నెలా బడ్జెట్ కేటాయింపు ఖర్చులపై సమావేశం నిర్వహిస్తుంటారన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందన్నారు. యూపీఏ హయాంతో పోలిస్తే ఎన్‌డీయే ప్రభుత్వం రాష్ట్రానికి విరివిగా గ్రాంట్లను మంజూరు చేసిందన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ కింద చాలా ముందుగానే నిర్ణయించినదానికంటే అధికంగానే నిధులు విడుదలయ్యాయని గణాంక వివరాలను మీడియాకు వివరించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ హయాంలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.60వేల కోట్లు మాత్రమే రాగా గత పదేళ్ల అవధిలో రూ.2.36 లక్షల కోట్లు అంటే 243 శాతం అధికంగా నిధులు మంజూరుయ్యాయన్నారు. ఇదే అవధిలో యూపీఏ హయాంలో రూ.81వేల కోట్ల పన్నుల వాటా రాగా గత పదేళ్లలో కర్ణాటకకు రూ.2.85 లక్షల కోట్లు అంటే 250 శాతం అధికంగా నిధులు విడుదల చేశామన్నారు. కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉందని, అయితే లక్షల కోట్లు బకాయి ఉన్నట్టు కేంద్రంపై విమర్శలు గుప్పిస్తుండడం సరికాదన్నారు. అబద్ధాలు చెప్పడంలోనూ, చెప్పించడంలోనూ సిద్దరామయ్యది అందెవేసిన చేయి అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

దామోదరం సంజీవయ్య (జయంతి)



ఏపీ మాజీ సీఎం దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు జిల్లా పెద్దపాడు గ్రామంలో జన్మించారు. మద్రాస్ లా కాలేజీలో డిగ్రీ పట్టా పొందిన ఆయన విద్యార్థిదశ నుంచే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 38వ యేట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. సంయుక్త మద్రాస్ రాష్ట్రంలో, ఆంధ్ర రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, కేంద్రంలోనూ పలు పదవులలో కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షుడు కావడం విశేషం. తెలుగు భాష వాడకం అధికం చేయడం, భూసంస్కరణల అమలు ఇలా ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు ఆయన హయాంలో చేపట్టారు. 1972 మే 7న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన స్మారకార్థం పాటిగడ్డ సమీపాన ఒక ఉద్యానవనాన్ని పెంచి 'సంజీవయ్యపార్క్' అని పేరు పెట్టారు.

మధుబాల (జయంతి)



దేశ సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన గొప్ప నటి మధుబాల 1933 ఫిబ్రవరి 14న జన్మించారు. అసలు పేరు ముంతాజ్ జెహాన్ బేగం. 1950 దశకంలో అత్యధిక పారితోషికం అందుకున్న నటీమణి. బాలీవుడ్‌లో రెండు దశాబ్దాలలో 73 సినిమాలలో నటించారు. 'మొఘల్-ఏ-ఆజం'లో అనార్కలి పాత్రతో ఎంతో గుర్తింపు పొందారు. కొన్ని సినిమాలకు నిర్మాతగాను, ప్లేబ్యాక్ సింగర్ కూడా వ్యవహరించారు. 36వ యేట 1969 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

సుష్మాస్వరాజ్ (జయంతి)




దేశంలో ప్రముఖ మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందిన సుష్మాస్వరాజ్ 1952 ఫిబ్రవరి 14న హర్యానా రాష్ట్రం అంబాలా ప్రాంతంలో జన్మించారు. బీజేపీలో అగ్రనేతగా పేరొందారు. కేంద్రమంత్రిగా, ఢిల్లీ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు ఆమె విద్యార్థి సంఘం నాయకురాలిగా రాణించిన ఆమె 1970లో రాజకీయాలోకి వచ్చారు. ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి 1977లో హర్యానా రాష్ట్ర శాసనసభలోకి ప్రవేశించారు. అదే సంవత్సరంలో కేంద్రంలో ఏర్పాటైన జనతా ప్రభుత్వంలో చోటు దక్కించుకున్నారు. 1996, 98లలో వాజ్‌పేయ్ మంత్రివర్గంలోనూ, 2014 నరేంద్ర మోదీ కేబినెట్‌లోను చోటు దక్కింది. 1998లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పలు హోదాలలో కొనసాగారు. 2019 ఆగస్టు 6న కన్నుమూశారు. 2020లో మరణానంతర పద్మభూషణ్ ప్రకటించారు.

కాంగ్రెస్ నేత పేరు రాసి డాక్టర్ ఆత్మహత్య

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గదగ్ జిల్లా రోణ తాలూకా హిరేహాళ గ్రామానికి చెందిన వైద్యుడు శశిధర్‌శెట్టి, కాంగ్రెస్ నాయకుడి ద్వారా అన్యాయం జరిగిందని చీటీ రాసిపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి ఇంట్లోనే లుంగీ ద్వారా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రోణ పోలీసులు తెలిపిన మేరకు ఆత్మహత్యకు ఇసుక దందా సాగించే కాంగ్రెస్ ముఖ్యుడు శరణగౌడ పాటిల్ కారణమని లేఖలో రాశారు. శశిధర్‌శెట్టి కూడా కాంగ్రెస్‌కు చెందినవారు కాగా శరణగౌడ పాటిల్‌తో పాటు మరొక వ్యక్తితో కలిసి ఇసుక వ్యాపారాలు చేశామని లెక్కలు సక్రమంగా చూపినా ఇంకా బకాయి పడ్డావని వేధింపులకు గురిచేస్తున్నారని లేఖలో రాసుకున్నారు. తీవ్ర మానసిక వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు లేఖలో రాశారు. ఆత్మహత్యకు కారకులైన శరణగౌడ పాటిల్‌కు శిక్ష పడాలని సమగ్ర వివరాలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్‌కే పాటిల్‌కు తెలపాలని రాశారు. రోణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నదిలో దూకి తల్లీకుమార్తె ఆత్మహత్య



తల్లీకుమార్తె (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా శెహబాద్ సమీపం లోని కాగిణా నదిలో దూకి తల్లీ కుమార్తెలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంబీ నగర్‌లో నివసించే తల్లి సుమలత(45), కుమార్తె వర్షా(22)లు ఆత్మహత్యకు పాల్పడిన వారు. సోమవారం సాయంత్రం నుంచి ఇరువురు ఇంటి నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు స్థానికులతో కలిసి వివిధ ప్రాంతాలలో గాలింపులు జరిపారు. కాగా మంగళవారం నదిలో మృతదేహాలను గుర్తించారు. జీవితంపై విరక్తి చెంది ఇరువురు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. శెహబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగంపై జాగృతి



గ్రామాల్లో సంచరించిన జాగృతి రథం

చేళూరు, ఫిబ్రవరి 13: తాలూకా పరిధిలోని చిలకలనేర్పు, ఏనిగదలె, బురుడుగుంటె, చేళూరు కేంద్రాలలో రాజ్యాంగంపై జాగృతి కల్పించే కార్యక్రమం ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. జాగృతి రథానికి గ్రామస్థులు ఉత్సాహంగా స్వాగతించారు. సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ శ్రీనివాసన్ నాయక్ ప్రసంగిస్తూ రాజ్యాంగం పీఠికను ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా కళాకారుల చైతన్య గేయాలు అలరించాయి. గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సవితా మహర్షి ఆలయానికి శంకుస్థాపన

» రాష్ట్రంలో ఇదే సవితా మహర్షి ఆలయం : రక్షా రామయ్య



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రక్షారామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సవితా సమాజ కుల దైవమైన భగవాన్ సవితా మహర్షి తొలి ఆలయ నిర్మాణానికి యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షా రామయ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. గౌరిబిదనూరు తాలుకా రాంపుర గ్రామంలోని సవితా బంధు యువశక్తి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సవితా మహర్షి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలి సవితా మహర్షి ఆలయానికి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా సవితా మహర్షి చరిత్ర పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఆధునిక నాగరికతలో సవితా సమాజం పాత్ర అత్యంత ప్రముఖమైనదన్నారు. మనుషుల కేశాలంకారం, సౌందర్యాన్ని మెరుగు పరిచేందుకు ఈ సంస్థ ఎంచుకున్న కులవృత్తి అత్యంత గౌరవ ప్రదమైందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. సవితా సమాజ ప్రగతికి తాను అన్ని విధాలా చేయూత నందిస్తానని రక్షారామయ్య ప్రకటించారు. సవితా మహర్షి చూపిన బాటలో మనమంతా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సవితా సమాజం స్థానిక ప్రముఖులు, గ్రామ పెద్దలు, యువనేతలు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా రక్షారామయ్య చేస్తున్న సామాజిక సేవలను నేతలు ప్రశంసించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున.. బీజేపీ ఎమ్మెల్యే ప్రచారం



ఎమ్మెల్సీ పుట్టణ్ణ తరపున ప్రచారం చేస్తున్న ఎస్‌టీ సోమశేఖర్

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, కాంగ్రెస్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పుట్టణ్ణ తరుపున ప్రచారం చేశారు. యశ్వంతపుర నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణకు మద్దతు ఇవ్వాలని కోరారు. సోమవారం నుంచి శాసనసభ సమావేశాలు ఆరంభం కాగా బీజేపీ ఎమ్మెల్యేల సభకు గైర్హాజరై కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎస్‌టీ సోమశేఖర్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం ఇదేమి కొత్త కాదు. గతంలో గృహలక్ష్మి పథకం ఆరంభంకు సంబంధించి నియోజకవర్గ కార్యకర్తల సభను జరిపారు. డీసీఎం డీకే శివకుమార్‌ను కొనియాడుతూ బహిరంగ సభలో మాట్లాడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థి తరుపున ప్రచారం చేయడం విమర్శలకు కారణమైంది.

నగరంలో అపురూప గురువందన



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల మిత్రబృందం

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాత విద్యార్థులంతా కలుసుకుంటే ఆ మధుర క్షణాలు ఎంతో ఆత్మీయంగా ఉంటాయి. గతాన్ని నెమరు వేసుకుని ఒకరి కష్టసుఖాలు, విజయాలు మరొకరు చెప్పుకుంటూ కబుర్లలో మునిగిపోతారు. నగరంలో గురువందన కార్యక్రమంలో పాల్గొన్న 1981, 1985 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయికకు గురువందన వేదికగా మారింది. ఎన్‌సి కాలనీ బిబి రోడ్డులో గల ప్రభుత్వ తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా 36 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన కేఎస్ వసంత కుమారి (స్వర్ణమ్మ), శివాజీనగర్ ఓపిహెచ్ రోడ్డులోని ప్రభుత్వ బాలుర బాలికల ప్రాథమిక పాఠశాలలో 34 సంవత్సరాల పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విమమణ చేసిన ఎస్.పరిమళలకు నగరంలోని ఒక ప్రయివేటు హోటల్‌లో ఆదివారం పాత విద్యార్థులంతా కలిసి గురువందన జరిపారు. ప్రత్యేకించి ఈ రెండు పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు వీరవణమ్మ, జీహెచ్ శ్రీనివాసులు, ఎస్‌కె.నాగ్లు, ఎస్ఎన్ లక్ష్మణ్ ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించి పాత విద్యార్థులందరూ ఒకే చోటు కలిసేలా కృషి చేయడం విశేషం. తమను గుర్తుంచుకుని తమను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని ఇది తమకొక మధుర స్మృతిగా ఉండిపోతుందని రిటైర్డ్ టీచర్లు స్వర్ణమ్మ, పరిమళ మీడియాకు చెప్పారు.

టెంట్లు తొలగించేందుకు చర్యలు



స్టాంప్‌వెండర్లు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక టెంట్లు

చింతామణి, ఫిబ్రవరి 13: పట్టణ కేంద్రభాగంలోని తాలూకా కార్యాలయ చుట్టుపక్కల ప్రత్యేకించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పలువురు స్టాంప్ వెండర్‌లు అనధికారికంగా వేసుకున్న తాత్కాలిక టెంట్‌లను తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తాలూకా కార్యాలలయానికి పలువురు ద్విచక్రవాహనాలలో వస్తుంటారు. దీనికితోడు దళారుల బెడద అధికమైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మార్గానికి అనుబంధంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రజల సంచారానికి తీవ్ర అంతరాయంగా మారింది. ఇందుకు సంబంధించి దివ్యాంగుడు ఒకరు నగరసభ కమిషనర్ చలపతి దృష్టికి తెచ్చారు. ఆయన తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, ఎస్‌టీఓ నారాయణప్పలతో చర్చించి ఒక వారంలోగా తొలగించేలా నిర్ణయం తీసుకున్నారు. తొలుత బెంగళూరు డబుల్ రోడ్డుపై ఫుట్‌పాత్ దుకాణాలు, తోపుడు బళ్లను తొలగించేలా చేశాక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సమస్యపై చర్చించారు. లైసెన్స్ లేని స్టాంప్ వెండర్‌లు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక టెంట్‌లను వారంలోగా తొలగించాలని, లేనిపక్షంలో నగరసభ ఆధ్వర్యంలో తొలగిస్తామని నగరసభ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవహరించాలని సూచించారు. లైసెన్స్ ఉన్నా ఎంతమంది రెన్యూవల్ చేసుకున్నారో వారికి మాత్రమే అవకాశం కల్పించదలిచామన్నారు.

భీమినేని సారథ్యంలో కలసి పనిచేద్దాం



భీమినేనితో స్థానిక టీడీపీ అభిమానులు

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరుకు చెందిన భీమినేని చిట్టిబాబునాయుడును తిరుపతి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులుగా నియమించిన మేరకు కలసి పనిచేద్దామని పలువురు అభిమానులు ప్రకటించారు. బెంగళూరు ఉత్తరహళ్ళిలో జీడీనెల్లూరు, తిరుపతి ప్రాంతాలకు చెందిన టీడీపీ అభిమానులు నాయకులు సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బెంగళూరు పార్టీ అభిమానులు ఎంపరాల కుమారస్వామి, రావిళ్ళ లోకేశ్, భీమినేని సురేశ్, పావులూరి ఢిల్లీ బాబు, గుత్తా అమరనాథ్, హేమంత్ తలపనేని, గుత్తా గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతిలో రాజకీయ కుట్రలనుంచి ఎదుర్కొని పార్టీ విజయం కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు.

'పిల్లల చదువుకు ఉత్తమ వాతావరణం కల్పించాలి'



పేరెంట్స్ సమావేశంలో అధికారి వెంకటరామ్ తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 13: పిల్లల ఉజ్వల భవిష్యత్తు అంశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని విద్యాశాఖ సమన్వయ అధికారి ఆర్ వెంకట రామ్ అభిప్రాయపడ్డారు. నేటి బాలలే రేపటి పౌరులని వారిని చక్కగా తీర్చడానికి ఉత్తమ వాతావరణం, వేదిక కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయు లతోపాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. పట్టణంలోని పీఎంశ్రీ మాదిరి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌డీఎంసీ సభ్యులు, తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమదైన దైనందిన పనులతో బిజీగా గడుపుతుంటారని అయితే పిల్లల చదువుపట్ల కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వారిని ప్రతిభను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ పిల్లల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల అభిప్రాయాలకు అనుగుణంగా మంచిచెడులను బేరీజు వేసి పిల్లల విద్యా ప్రగతికి అవసరమైన మార్పులు చేర్పులకు సిద్ధమన్నారు. త్వరలోనే పాఠశాల వార్షికోత్సవం, మాతృభోజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వై మంజునాథ్‌రెడ్డి, ప్రభావతి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి నాగరాజు, మహబూబ్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నక్కనహళ్లిలో మౌలిక సదుపాయాలు కరువు



దుస్థితిలో కంకరతేలిన రోడ్డు ఇలా...

బంగారపేట, ఫిబ్రవరి 13: తాలూకాలోని బలమందె గ్రామపంచాయతీ పరిధిలోని నక్కనహళ్ళిలో మౌలికసదుపాయాలు కల్పించకపోవడంపై గ్రామస్థులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు ప్రకటించినా వీటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దిన్నూరు, బలమందె మెయిన్‌రోడ్డు నుంచి నక్కనహళ్ళికి సుమారు 300 మీటర్ల మేర కంకరరోడ్డు వేశారు. సంవత్సరాలు, దశాబ్దాలు గడిచినా డాంబరీకరణకు నోచుకోలేదు. ఏళ్ల తరబడి రోడ్డు అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సుమారు 200మంది ఉన్నా శుద్ధతాగునీటి సదుపాయం లేదు. సుదూరంలోని బలమందె నుంచి తెచ్చుకోవాల్సిందే. కాగా సాధారణ వినియోగానికి 15 రోజులకొకమారు నీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇన్ని రోజులపాటు నిల్వ ఉండడం ద్వారా తరచూ పురుగులు, పాచి సమస్య తలెత్తుతోందన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు. అంగన్‌వాడీకి వెళ్లే 10మంది, పాఠశాలకు వెళ్లే 15మంది విద్యార్థులు ఉన్నా ఇక్కడ సదుపాయం లేకపోవడంలో ఒక కిలోమీటరు దూరంలోని బలమందెకు నడిచి వెళ్తున్నారన్నారు. కనీసం అంగన్‌వాడీలో బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం పొందేందుకు గ్రామానికి బస్సు సదుపాయం లేకపోవడంతో బలమందెకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. నక్కనహళ్ళిలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామం నుంచి సుమారు 500మీటర్ల దూరంలో స్మశానం ఉంది. అయితే స్మశానానికి వెళ్లేందుకు సరైన రోడ్డు కూడా లేదని గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. దిన్నూరు, కామసముద్ర అటవీప్రదేశ మధ్యలో గ్రామం ఉన్నా కనీసం ఇక్కడ వీధి దీపాల వ్యవస్థ కూడా లేదు. దీంతో సాయంత్రం తర్వాత ఇక్కడ సంచారం కూడా గగనమే అనేలా ఉంది. ఈ విషయమై పలుమార్లు వార్డు సభలలో ప్రస్తావించినా ప్రయోజనం లేకపోయిందని పీడీఓ తీరుపై ఆక్రోశం వ్యక్తం చేశారు. అంతేకాక పశువులు తాగేందుకు ఉద్దేశించిన తొట్టె గోడ దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా బాగు చేయలేదని, కనీసం రోడ్డు దుస్థితిపై కూడా స్పందించడం లేదని గ్రామస్థుడు సురేశ్‌బాబు వాపోయారు. గ్రామానికి చెందిన కిట్టప్ప మాట్లాడుతూ ఎన్నికల వేళ మాత్రమే ఇక్కడ నాయకులు, అధికారులు కనిపించి హామీలు ఇస్తారని మిగిలిన రోజుల్లో వారి జాడ ఉండదన్నారు. బంగారుపేట తహసీల్దార్ రశ్మి స్పందిస్తూ త్వరలోనే నక్కనహళ్ళి గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



నీటి సరఫరా ట్యాంకు ఇదే...

మహారాష్ట్ర తీరుపై కన్నడ సంఘాల తీవ్ర ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్రం అమలు చేస్తున్న పథ కాలు గానీ, స్వయంగా కర్ణాటక ప్రభుత్వం అమలు చేసే పథకాలు గానీ ఉంటే అది ప్రముఖ వార్త కానే కాదు. ఇందుకు విరుద్ధంగా మహారాష్ట్ర ప్రభుత్వం తాను అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిరావ్ పూలే జనారోగ్య పథకాన్ని కర్ణాటకలో అమలు చేసేందుకు నిరంతర ప్రయత్నాలు చేస్తూనే ఉంది. తాజాగా ఈ పథకాన్ని పరిపూర్ణంగా అమలు చేసేందుకు గాను బెళగావి సరిహద్దులో తహసీల్దార్ స్థాయి అధికారులను మహారాష్ట్ర ప్రభుత్వం నియమించడం వివాదాస్పదంగా మారింది. కర్ణాటక ప్రభుత్వ అభ్యంతరాలను తోసిపుచ్చి రాజని, కన్నడ సంఘాల ఆక్రోశాన్ని పూర్తిగా పక్కన పెట్టి కర్ణాటకలో మరాఠీలు అధికంగా ఉంటున్న నాలుగు జిల్లాల్లోని 865 గ్రామాల్లో విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలోని బెళగావి సరి హద్దులో గుట్టు చప్పుడు కాకుండా ఇటీవల తలెత్తిన ఈ ఆరోగ్య పథకం నమోదు కేంద్రాలను కర్ణాటక ప్రభుత్వం మూసివేయించిన సంగతి విదితమే. బెళగావి, విజ యపుర, కలబరగి, ఉత్తరకన్నడ జిల్లాల్లో స్థిరపడ్డ మరాఠీలు ఉత్తమ ఆరోగ్య సేవల కోసం మహారాష్ట్రలోని మిరజ్, పూణె, సాంగ్లి, కొల్హాపుర, షోలాపూర్ లకు వెళ్లడం పరిపాటిగా ఉంది. ఇలా వైద్యసేవలకోసం కర్ణాటక నుంచి వచ్చే వారందర్నీ తమ వారుగా ముద్రవేసేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎట్టి స్థితిలోనూ ఇందుకు అనుమతి ఇవ్వరాదని బెళగావి జిల్లా కన్నడ సంఘాల క్రియాసమితి అధ్యక్షుడు అశోక్ చందరగి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బెంగళూరులో మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కన్నడ సరిహద్దు ప్రాధికారను మరిన్ని అధికారాలతో బలోపేతం చేయాలని కమిటీలకు మంత్రులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం కర్ణాటకలో మరాఠీ భాష మాట్లాడే వారు అధిక సంఖ్యలో ఉన్న 865 గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేయాలని అక్కడి ప్రభుత్వం గత కొద్దికాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి విదితమే.

సుగటూరు డెయిరీ జేడీఎస్ కైవసం



ఎమ్మెల్యే రవికుమార్‌ను సత్కరిస్తున్న పాలసంఘం డైరెక్టర్లు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 13: తాలూకాలోని సుగటూరు గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో ఈసారి జేడీఎస్ వశమైంది. సుమారు 40ఏళ్లుగా కాంగ్రెస్ మద్దతుదారులదే హవా ఉండగా 13 డైరెక్టర్‌ల స్థానాలకు గాను 11 స్థానాల్లో జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందారు. నూతన డైరెక్టర్‌లుగా మంజునాథ్, నారాయణగౌడ, వెంకటేశ్‌గౌడ, ఎస్ఎం రఘు, గోపాల్, నారాయణస్వామి, మునిరాజు, నాగరాజ పిళ్ళప్ప, ఎన్ నాగరత్నమ్మ, మునేగౌడ చౌడమ్మ, ఎస్‌కే సీనప్పలు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా భేటీ అయి సత్కరించారు. పాడిరైతుల సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని డైరెక్టర్‌లకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు అశోక్, రవికుమార్, నారాయణస్వామి, పాపణ్ణ, ఎస్ఎం నారాయణస్వామి, నాగభూషణ్, మునిరాజు, మాధు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కిండర్ ఆసుపత్రి శిబిరాలు



కార్యక్రమంలో నటి హర్షిక పూణచ్చ, మాజీ మంత్రి లింబావళి తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 13: ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న కిండర్ ఆసుపత్రి సేవలు అభినందనీయమని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. కేఆర్ పుర నియోజక వర్గంలోని దేవసంద్ర వార్డు బీ నారాయణపురలోని కల్యాణమండపంలో కిండర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కిండర్ ఉమెన్స్ వెల్ఫేర్ ట్రస్టు సీఎస్ఆర్‌లో భాగంగా కిండర్ మా జీవన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎస్ఆర్ ఫండ్ నుంచి మహిళలకు ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సలకు రూ.2కోట్లు కేటాయించారన్నారు. పేదలైన అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి ఇన్సూరెన్స్ స్కీమ్ లేకున్నా చికిత్సలు అందించి డిశ్చార్జ్ చేస్తారన్నారు. నటి హర్షిక పూణచ్చ మాట్లాడుతూ మహిళలు సరైన సమయంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రతి వార్డులోనూ శిబిరాలు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ వీకే ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేద మహిళలకోసం సీఎస్ఆర్ కింద చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. కిండోరమా హెల్త్‌కేర్ గ్రూప్ సీఈఓ రంజిత్‌కృష్ణన్, బీజేపీ నియోజకవర్గ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు నటరాజ్, కేఎంఎం మంజునాథ్, స్థానిక ప్రముఖులు పిళ్ళప్ప, వర్తూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రామాణికతతో విధుల నిర్వహణ



న్యాయమూర్తి జస్టిస్ దినేశ్‌కుమార్‌కు సన్మానం


శిడ్లఘట్ట, ఫిబ్రవరి 13: ప్రతి ఒక్కరూ ఏదో ఒక పనిచేసి జీవనం సాగిస్తారని అయితే ప్రామాణికత, నిబద్ధతతో నిర్వహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీహెచ్ దినేశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శిడ్లఘట్ట న్యాయవాదుల సంఘం సోమవారం రాత్రి ఏర్పాటైన కార్యక్రమంలో స్వామివివేకానంద భావచిత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ స్వామి వివేకానంద ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. చిన్న వయస్సులోనే ఎంతో ప్రతిభ చాటుకున్నారన్నారు. ఆయన మరింతకాలం ఉండి ఉంటే దేశం మరింత ప్రగతి సాధించి ఉండేదన్న అభిప్రాయపడ్డారు. న్యాయాధికారి ఎంబి అరుణ్‌కుమార్, ఎన్‌వీ భవాని, రామ్‌మోహన్‌రెడ్డి, శిడ్లఘట్ట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ అధ్యక్షుడు ఎం పాపిరెడ్డి, బెంగళూరు న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్‌పేటలో ప్రచారానికి శ్రీకారం



ప్రచారానికి శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్

బెంగళూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దేశప్రధానిగా నరేంద్రమోదీ మరోసారి అనే నినాదంతో ప్రచార భేరిని ప్రారంభించిన బీజేపీ నగరంలోని అన్ని శాసనసభా నియోజక వర్గాల్లోనూ జోరు పెంచింది. ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధాని కావాలన్న ఆకాంక్షతో చిక్‌పేట నియోజకవర్గంలోని వీవీ పురంలో ప్రచార కార్యక్రమానికి చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ మంత్రంతోనే ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథకంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు మోదీ నాయకత్వంపై అచంచల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రం నుంచి ఈసారి మొత్తం 28 నియోజకవర్గాలను క్లీన్‌స్వీప్ చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ మాజీ కార్పొరేటర్లు వేదవ్యాసభట్, సత్యరాజ్, కవితా జైన్‌తో పాటు స్థానిక నేతలు సుయోధన్, అరవింద్ చవాణ్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.95	1,611.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	165	8,355
సామర్థ్యం (టీఎంసీలు)	9.40	41.49

హుండీ లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న భక్తులు

కంప్లి, ఫిబ్రవరి 13 : జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ సమితి, వివిధ సంఘ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. హుండీ లెక్కింపులో రూ. 21,79,500 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గత ఆగస్టు 17, 2023న లెక్కించగా మరలా మంగళవారం లెక్కించారు. ఇందులో ఈ మొత్తం ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయంతో ఆలయ అభివృద్ధి, భక్తులకు అన్నదానం, వసతి సౌకర్యాలు చేపడ్తామన్నారు. మురళీధర, మల్లయ్య, ఆనంద్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సిరులు కురిపించిన ప్రేమికుల రోజ్



● రూ.5కోట్లకు పైగా అమ్మకాలు ● రోజా పూల రైతుల్లో హర్షం ● ఎగుమతిపై జీఎస్టీ తగ్గించాలని డిమాండ్

హోసూరు, ఫిబ్రవరి 13: ప్రేమికుల రోజు సంబరాలకు అంతా సిద్ధమయ్యారు. వాలంటైన్స్‌డేకు రెండు మూడు నెలల ముందు నుంచే హోసూరు తదితర ప్రాంతాల్లో రోజా పూల రైతుల్లో హడావుడి ప్రారంభమవుతుంది. హోసూరు ప్రాంతంలో రకరకాల రోజా పూలు సాగు చేస్తున్నారు. ప్రత్యేకించి న్యూ ఇయర్, వేలంటైన్స్ డే ఇతరత్రా రోజులలో ఇక్కడనుంచి వివిధ రాష్ట్రాలకే కాకుండా విదేశాలకు కూడా గులాబీ సహా పలు రకాల ఎగుమతి అవుతున్నాయి. ఈ ఏడాది దాదాపు రూ.6 కోట్ల పూలు ఉత్పత్తి కాగా స్థానికంగా రూ.5 కోట్ల పూలు అమ్ముడయ్యాయి. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌తో పోలిస్తే ఈ ఏడాది రూ.15 నుంచి రూ.18 వరకు ధర పలకడంతో స్థానికంగా అమ్మకాలు సాగాయి. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అయితే పూల ఎగుమతిపై జీఎస్టీ తగ్గించాలనే డిమాండ్ రైతులనుంచి వ్యక్తం అవుతోంది. హోసూరులో జిల్లా హర్టికల్చర్ ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్ బాబు వెంకటాచలం మీడియాతో మాట్లాడుతూ 2019లో అంతర్జాతీయ పూల వేలం కేంద్రాన్ని హోసూరులో నిర్మించారని అయితే పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదన్నారు. ఆసియాలోనే అత్యాధునికమైన ఈ వేలం కేంద్రాన్ని ప్రభుత్వం చొరవ చూపి ప్రజలలకు, రైతులకు ఉపకారిగా వినియోగానికి తీసుకురావాల్సి ఉందన్నారు. వివిధ రకాల పూలను ఈ కేంద్రం నుంచి ఎగుమతి చేసేందుకు విమాన చార్జీలు పెరిగిన నేపథ్యంలో జీఎస్టీ ధరలు తగ్గించాల్సి ఉందన్నారు. కోయంబత్తూరులో ఎక్కువ భాగం మలేషియా, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. జీఎస్టీ తగ్గిస్తే మరింత లాభదాయకమవుతుందని పేర్కొంటున్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న రోజాపూలు

భారీగా పూలసాగు..

హోసూరు ప్రాంతాల్లో సుమారు 2వేల హెక్టార్లలో గులాబీ పూలు సాగు చేస్తున్నారు. వీటిని తాజ్‌మహల్ రోజా పూలు అని పిలుస్తారు. ప్రేమికుల రోజున డిమాండ్ నెల కొనగా పొరుగు దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కొవిడ్ వంటి క్లిష్ట సమయంలోనూ, భారీ వర్షాలు ఇతరత్రా కారణాలతో నష్టపోయిన పూల రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ప్రస్తుతం పూల ధరలు పెరగడంపై రైతులు ఓ వైపు సంతోషం వ్యక్తం చేస్తుండగా ప్రపంచ వ్యాప్తంగా గులాబీ పూలను మార్కెట్ల నుంచి ఎగుమతి చేస్తున్నారు. కొత్త రకం గులాబీలు ఇప్పుడిప్పుడే పండిస్తున్నారు. ఆఫ్రికన్ గులాబీలకు డిమాండ్ ఉంది. ఇటీవల పూల ధరలు తగ్గుముఖం పట్టినా తాజాగా ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడుకే కాకుండా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు పెరగడంపై హర్షం వ్యక్తం అవుతోంది,



విరివిగా కాసిన రోజా పూలు

అంబాదేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఫిబ్రవరి 13 : గ్రామస్థుల ఆరాధ్య దైవం అంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి రాజశేఖర్ అంబాదేవికి రానున్న ఎంపీ ఎన్నికల్లో బళ్లారి జిల్లా నుంచి చైతన్య తుకారామ్‌కు అవకాశం కల్పించాలని అంబాదేవికి 101 టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సండూ రు ఎమ్మెల్యే ఈ తుకారామ్ గత నాలుగు సార్లుగా ఎమ్మెల్యే ఎన్నికయ్యారు. తమ నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి ప్రతి ఎమ్మెల్యేగా విజయం అందిస్తున్నారు. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన చైతన్య తుకారామ్‌కు కూడా ఎంపీ టికెట్ హైకమాండ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్పించినట్లయితే జూనియర్ ఇందిరమ్మ గాను, బళ్లారి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. బళ్లారి సిటీ, బళ్లారి రూరల్, సిరుగుప్ప, కంప్లి, సండూరు ఐదు తాలుకాలలో తమ నాయకుడు ఈ తుకారామ్ తమ మంత్రి పదవి వున్న సమయంలో విద్యార్థులకు ఎంతో సదుపాయాలు కూడా కల్పించారు. వారితో పాటు కౌన్సిలర్లు వెంకటరమణ బాబు, సు నీల్, లెనిన్, కనికేరి పంపాపతి, బీసన్న, దొడ్డప్ప, చంద్రయ్య దొడ్డ బసప్ప, అంజి, సండూరు కార్మిక విభాగం అధ్యక్షులు మోటా తిమ్మప్ప, గ్రీన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్, భీమా, రాజా, అశోక్ పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న అభిమానులు



మాట్లాడుతున్న పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుడు అస్లాం బాషా

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

సిరుగుప్ప, ఫిబ్రవరి 13 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సర్వశిక్ష అభియాన్ అధికారి తిమ్మన్న గౌడ పాటిల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అస్లాం బాషా రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్వశిక్ష అభియాన్ అధికారి తిమ్మన్నగౌడ పాటిల్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు నేర్పడంతోనే దేశ ప్రగతి రోజు రోజుకు ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, ఆధునిక సమాజంలోనూ విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా సమాజ సేవకులు అబ్దుల్ నబీ, ముఖ్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాల పేర్లు కన్నడలోనే ఉండాలి

● జయ కర్ణాటక డిమాండ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13: నగరంలో దుకాణాల ముందు నామఫలకాలు కన్నడ భాషలో ఉండాలని జయ కర్ణాటక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. జిల్లాకలెక్టర్, మహానగరపాలిక సంస్థ కమిషనర్‌కు జయ కర్ణాటక సభ్యులు మంగళవారం వినతి పత్రం అంద జేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, దుకాణాల ముందు నామఫలకాల్లో 60శాతం కన్నడ భాషను బోల్డ్ అక్షరాలతో రాయాల న్నారు. అయితే కమర్షియల్ దుకాణాల యజమానులు కన్నడ భాషకు ద్రోహం చేసేలా ఇంగ్లీషు తదితర భాషల్లో పెద్దపెద్ద బోర్డులు పెట్టి కన్నడకు వ్యతిరేక ధోరణి అవలంబించడం సరి కాదన్నారు. దుకాణదారులు కన్నడ భాషలో నామఫలకాలు అమర్చేలా జిల్లా యంత్రాంగం , పరిషత్ కౌన్సిల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా బళ్లారి జిల్లాధ్యక్షుడు ఎర్రిస్వామి, బసవరాజ్, మ హిళా నగర అధ్యక్షురాలు సునీతా, జిల్లాధ్యక్షురాలు పి.రజియా, బళ్లారి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ హెగ్డే,ఆటోడ్రైవర్స్ యూనిట్ మంజునాథ్, నగర ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి, జిల్లా కార్యదర్శి రఫీక్‌తో సహా పలువురు పాల్గొన్నారు.



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న జయ కర్ణాటక వేదిక సభ్యులు

జేఈఈలో మెయిన్స్‌లో 'వశిష్ట' విద్యార్థుల ప్రతిభ



విక్రమ్ సూర్య | చిన్మయి | ఉత్కర్ష | హఫిజా | అమోఘ | క్రిష్ణాకౌశిక్ రెడ్డి | శ్రేయ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ 2023-24 సంవత్సరానికి గాను నగరంలోని వశిష్ట కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి సత్తా చాటారని ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ఫలితాలతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించారన్నారు. విక్రమ్ సూర్య 99.89 పర్సంటైల్ , కుమారి చిన్మయి 99.43పర్సంటైల్ సాధించారన్నారు. అదే విధంగా అనేక విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో ఉత్కర్ష 99.48, హఫీజా 96.22, అమోఘ 94.91, క్రిష్ణకౌసిక్‌రెడ్డి 94.27 శ్రేయ ఎం.జోషి 94.02 , ఇంకా అనేక మంది విద్యార్థులు 90పర్సంటైల్ సాధించారన్నారు. విద్యార్థులను కాలేజీ పాలక మండలి అభినందించింది.

ప్రతిభ చాటిన చైతన్య కళాశాల విద్యార్థులు



రిషికేశ్‌రెడ్డి | మహ్మద్ ఫైజాన్ | సంగమేశ్వర్‌బారికర్ | ప్రజ్వల్‌కరడి | స్ఫూర్తి | చేతన్ కాదిమారాద్ | శ్రీవర్షిని

జేఈఈ మెయిన్స్‌లో 2024 సంవత్సరానికిగాను నగరంలోని చైతన్య పదవి పూర్వ కాలేజ్ విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై పాలక మండలి రాధాకృష్ణ, కళాశాల బృందం అభినందించింది. రిషికేశ్‌రెడ్డి, 98.66, మహ్మద్ ఫైజాన్ 95,92, సంగమేశ్వర్ బారికర్ 94.47, ప్రజ్వల్‌కరడి 93,66, స్ఫూర్తి 93.47. ఆదిత్య 93.43, చేతన్ కాదిమారాద్ 93.20, శ్రీవర్షిని 92.60, త్రినయ్ 91,97, బన్నిశంకర్ 91.47. అభినయ్ 91.46, అపేక్ష 91.09, శ్రీలక్ష్మి 90,27,వైష్ణవి 89.68, సంతోష్‌కుమార్ 89.44 పర్సంటైల్‌తో కాలేజీకి కీర్తిని తీసుకొచ్చారని కొనియాడారు.



త్రినయ్ | బన్నిశంకర్ | అభినయ్ | అపేక్ష | శ్రీలక్ష్మి | వైష్ణవి | సంతోష్‌కుమార్

ఘనంగా వీరభద్రప్ప తాత ఆరాధన

సిరుగుప్ప, ఫిబ్రవరి 13 : వీరభద్రప్ప తాత 22వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సిరుగప్ప పట్టణంలోని 24వ వార్డులో వెలసిన వీరభద్ర ప్ప తాత ఆరాధన మహోత్సవాలను ఆయన కుమారుడు గంగాధర గౌడ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. రాత్రంతా అఖండ భజనలు నిర్వహించారు. అన్నదాన కా ర్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్ర ముఖులు ఉచ్చీరప్ప, శరణప్ప, వీరేష్, ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప, ప్రజలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహించిన భక్తులు

19న రైతు సమస్యలపై ధర్నా



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు పూజారప్ప

పావగడ, ఫిబ్రవరి 13: తాలూకా కార్యాలయం ముందు రైతు సమస్యలు, తుంగభద్ర నీటితరలింపు ఆలస్యంపై రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. మంగళవారం పీడబ్ల్యూడీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2017 సంవత్సరంలో తుంగభద్ర తాగునీటి కోసం అప్పటి ముఖ్యమంత్రి సిద్దరామయ్య రూ. 2350 కోట్ల నిధులను విడుదల చేశారన్నారు. అయితే తాగు, సాగునీరు అందడంలేదని, ఇది పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బగర్‌హుకుం భూములను సాగు చేసే రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సి.పవర్ కంపెనీపై చర్యలుతీసుకోవాలని డిమాడ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్నామన్నారు.

రద్దీ వేళల్లో బస్సుల సంఖ్యను పెంచాలి



కిటకిటలాడుతున్న బస్టాండ్ ప్రాంతం

తోరణగల్లు, ఫిబ్రవరి 13 : పారిశ్రామిక ప్రాంతంమైన తోరణగల్లు స్టేషన్ ప్రాంతంలో వివిధ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు బస్సు ఎక్కాలంటే తిప్పలు తప్పడం లేదు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు హోస్పేట వైపు గాని, బళ్లారి వైపు గానీ ప్రయాణం చేయాలంటే విపరీతమైన శ్రమకు గురవుతున్నారు. ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై కూడా అనునిత్యం ఖాళీ జాగా వుండటం లేదు. మధ్యాహ్నం రెండు గంటల నుండి నా లుగు గంటల మధ్య ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో బస్సులను తగ్గించి సాయంత్రం వేళలో ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు అనుకూలమవుతుందని కోరుతున్నారు. ఈ విపరీతమైన ప్రయాణికుల మధ్య కొంతమంది మనీపర్సులను, ఫోన్లను పోగొట్టుకున్నట్లు తెలుస్తున్నది. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని రద్దీ వేళల్లో బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలి

● లోకాయుక్త సీఐ సంగమేష్



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న లోకాయుక్త అధికారులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 13 : ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలని లోకాయుక్త సీఐ సంగమేష్ సూచించారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం సీడీపీఓ భవనంలో లోకాయుక్త అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా 20కి పైగా దరఖాస్తులను అందుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల పనితీరును పరిశీలించారు. ప్రజల స మస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు అవినీతి, నిర్లక్ష్యం, విధులకు గైర్హాజరైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భగా తహసీల్దార్ షం షాలం, ఈఓ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


బళ్లారి రూరల్, ఫిబ్రవరి 13: అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాలూకాలోని కుంటన హాళ్, రూపనగుడి రోడ్డు మార్గంలో కుంటనహాళ్ గ్రామానికి చెందిన సిద్ద న్నగౌడ వ్యవసాయ పొలం గోడౌన్‌లో రూ. 2.90 లక్షలు విలువ చేసే వంద క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం, 15 క్వింటాళ్ల గోధుమలను నిల్వ వుంచి లారీ ద్వారా రవాణా చేస్తున్నారన్న సమా చారం అందుకున్న పోలీసులు, ఆహార శాఖ అధికారి ఈశ్వర్ , అధికారులు మల్లికార్జున, పోలీసు సిబ్బంది చేరుకుని బి య్యం, గోధుమలను స్వాధీనం చేసు కున్నారు. సిద్దనగౌడపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న లారీ, బియ్యం

కర్ణాటక రెడ్డి జనసంఘ్ డైరెక్టర్‌గా గణపాల్ ఐనాథ్‌రెడ్డి ఏకగ్రీవం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13: కర్ణాటక రెడ్డి జనసంఘ్ డైరెక్టర్‌గా గణపాల్ ఐనాథ్‌రెడ్డి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న కర్ణాటక రెడ్డి జనసంఘ్ పాలక మండలికి తదుపరి మూడేళ్లపాటు డైరెక్టర్ పదవికి ఎన్నికలు జరిగాయి. నేతలంతా కలిసి ఏకపక్షంగా ఎన్నియ్యారు. ఎన్నికైనవారిలో ఎక్కువ మంది బెంగళూరుకు చెందిన వారే, కల్యాణ కర్ణాటక నుంచి ఐనాథ్‌రెడ్డి ఒక్కరే ఎన్నికయ్యారు. సంఘం నాయకులతో పరిచయం, బళ్లారిలో వేమన పీఠం అధ్యక్షుడిగా చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి ఈ అవకాశం వచ్చిందని పేర్కొంటున్నారు.



గణపాల్ ఐనాథ్‌రెడ్డి

పాఠశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 13: నగరంలోని 35వ వార్డుఇందిరా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కర్ణాటక స్లమ్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మహానగర పాలక సంస్థ సభ్యుడు మించు శ్రీనివాసులు, కొళగేరి బోర్డు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ వి. తిమ్మన్న, ప్రకాశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమక్క, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మల్లికాబేగం, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మారుతీ, వైద్యులు మంజునాథ్, సంగీత, స్థానికులు రమేశ్, హంపి మల్లి, శశికుమార్, నాగరజ్ తదితరులు పాల్గొన్నారు. ఈశిబిరంలో చాలా మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హోసూరు జోన్

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన మేయర్

హోసూరు, ఫిబ్రవరి 13: హోసూరు కార్పొరేషన్ పరిధిలో కామరాజ్ కాలనీలో మేథో కేంద్రం, లైబ్రరీని ఇటీవల వివిధ సౌకర్యాలతో పూర్తి చేసి తమిళనాడు ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇది వినియోగంలోకి రాగానే హోసూరు మేయర్ సత్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని గ్రంథాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రాజారాం, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రమప్ప, కౌన్సిలర్ మోసిం తాజ్ నిసార్, హరిప్రసాద్, దినేశ్ పాల్గొన్నారు.



గ్రంథాలయంలో సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ సత్య